

# మరి, మీకెలా కనబడుతోంది లోకం?

మల్లాప్రగడ రామారావు

**'మంచి'** అన్నది లోకంలో లేదని నా నిశ్చయమైన అభిప్రాయం. ఈ అభిప్రాయానికి ప్రాతిపదిక ఏమిటా అని నే నెప్పుడూ ఆలోచించలేదు. ఐతే అనాలోచితంగానే నాకు నేను అర్థమవటం జరిగింది. అదెలా జరిగిందీ అంటే... అది చెప్పేందుకే యీ కథ.

ఎండవేళ ఓ మధ్యాహ్నం ఉస్సురను కుంటూ ఆ ఊళ్ళో బస్సు దిగాను అక్కడికి మా ఊరు సుమారు ఆరు ఫర్లాంగుల దూరం.

పేరుకి మా వూరే గాని అక్కడ నేను పుట్టాలేదు, పెరగాలేదు. అంతెందుకు? నాకు పద్దెనిమిదేళ్ళు నిండేవరకూ నేనా వూరే పోలేదు.

మరి మా ఊరెందు కయ్యిందీ అంటే మా కక్కడ పొలాలున్నాయి. చెరువుగట్టు నుంచీ, బోడిమెట్ట వరకూ భూములన్నీ మావేనుట. ఇప్పుడు కాదనుకోండి. మా పూర్వీకుల హయాంలో.

మా తాతగారి కాలం నాటికే మేం పట్నం తరలి వచ్చేసాం. ఏటా వో రెండు నెల్లు ఆ ఊర్లో మకాం వెయ్యడం కుప్పలు నూర్పించి 'మగతా' కొలిపించుకోడం. ఆ వూరికీ, మాకూ వున్న సంబంధ మల్లా అదొక్కటే!

కారణాలేవయితేనేం మా నాన్నగారి తరాని కొచ్చేసరికి వో పన్నెండెకరాల పొలం మాత్రం మిగిలింది. మళ్ళీ అందులో కొంత 'భోగ బందా'లో వుంది.

తెల్లార్లయింది– నాన్నగారు ఫస్టా వూరు వెళ్లి. ఇంకా కుప్పలు నూర్పలేదుట. పట్నంలో నాకేమో డబ్బు యిబ్బంది లావయింది.

దగ్గరుండి కుప్ప నూర్పించి, ధాన్యం లమ్మించి, కొంతయినా సొమ్ము తీసికెళ్దా మని ప్రయాణం పెట్టుకున్నాను.

'ఎయిర్ బాగ్' ఊపుకుంటూ గోర్జిదారి పట్టాను. ఎ్రఅని ఎండకు యిసుకమండుతూ వుండాలి. కాని దారినిపోయే వాళ్ళలో, ఒక రిద్దరికి తప్పించి, ఎవరికీ చెప్పుల్లేవు. పాతదో. చింకిదో గుడ్డముక్క కట్టుకుని. భుజానో గుడ్డ వేసుకుని నడుస్తున్నారు చాలామంది.

గోర్జి కిరువైపులా చేసు కొయ్యగా మొదళ్ళు మాత్రమే మిగిలివున్న పొలాలు. పొలం గట్లంట మేస్తున్న పశువుల్నికాపలా కాస్తున్న 'సొమ్ముల కుంటలు'. అక్కడక్కడా 'హొలో' మని కేకలువేస్తూ పోతున్న అదమాయిస్తూ, కళ్ళుకొ్ౕచేసుమిట్టిస్తున్న పాలేళ్ళు.

అన్నీ చూసుకుంటూ చెఱువు గట్టెక్కేను. అక్కడనుంచీ మా వూరు కొంచెం కనబడుతుంది– నాయుడుగారి మామిడి తోట వెనకాల్నుంచి.

చెఱువునిండా నీటిని కప్పేస్తూ తామరాకులు. నీటిలో యీదుతూ వెళ్తున్నారు కొందరు తామరతూళ్ళకోసం. అక్కడే చాకిరేవు.

పేపు బాటవేపు వుంచి, వయసు నిండాని చాకలిపిల్ల ఎవరిదో ఉతికిన 'బ్రాసరీ' రొడుక్కుంటోంది. గూనల్లోంచి వస్తున్న పొగ ఆమెచుట్టూ అల్లుకుంటోంది.

గట్టు దిగువన. ఉలిమీద సుత్తివుంచి, 'పిక్కకోసం మందుపెట్టి' పేల్చిన మెట్ట రాళ్ళను కొడుతున్న వంగిన శరీరాల మీది చెమట బిందువులు ఎండలో తళతళలాడుతున్నాయి.

పొలంగట్టు పట్టాను. తిన్నగావెళ్తే మర్రిచెట్టువస్తుంది. దానానుకునే నాయుడుగారి కళ్ళం. ఆ ప్రక్కనుంచి ఊర్లోకి దారి.

నోట్లో చుట్టపెట్టుకొని చెట్టుకింద కూర్చున్న దండాసి అంకమ్మ చుట్టతీసి పలకరించింది. క్షణం చెట్టుక్రింద నిల్చుని పరిశీలనగా ఊరివోసారి చూసాను. అన్నాళ్ళ క్రిందట ఎలావుందో యిప్పుడూ అలానే వుంది.

ఊరి మొదట మాలపేట. ఒకదాన్నొ

క్కటి అంటిపెట్టుకుని, నేలని కరుచుకుని వున్న గుడిసెలు కొంచెంఎడం ఆ వాసనే త్రోవకు రెండువేపులా సంసారులయిళ్ళు, పూరిళ్ళు.

మాలవాళ్ళ గడపలో పాతిక. రైతు వారీ యిల్లో యాభై. కోమటిదుకాణం. ఊరి మంగలిదొకటి, కంసాలులలో నాలుగైదు పూరిళ్ళుకలసి మా వూరయ్యాయి.

మరచిపోరాను వూరిమధ్యగా దిబ్బ మీద కూలిపోతున్న ఏకోపాధ్యాయ ప్రాథమిక పాఠశాల—సర్కారువారిది వుంది.

ఊరంతటికీ మునుపొక్కటే పెంకుటిల్లుండేది నాయుడుగారిది. మేం ఎప్పుడొక్కడికొచ్చినా వారియింట్లోని గదే ఒకటి కేటాయిసారు ఇప్పుడా పెంకుటిల్లు డాబా అయింది. వరసగా వున్న పూరిళ్ళమధ్య మరో పెంకుటిల్లు లేచింది. నేను గుర్తించిన మార్పులివే.

పశువులసాల ప్రక్కనుంచి నాయుడి గారింటివేపు నడిచాను నా పంట్లాం, బుష్ షర్ట్లవేపు, చేతిలోని బ్యాగ్ వేపు పరిశీలనగా చూస్తూ, 'బాగున్నావా ?' 'ఇదే నేటి రావడం' 'ఎండ పడొచ్చినావు. బేగి యింట్లోకెల్లు' అంటూ పలకరిస్తున్న వారికి సమాధానంగా చిరునవ్వు నవ్వుతూ మెట్లెక్కి తలుపు తట్టేను.

అమ్మ తలుపు తీసింది. కుశల ప్రశ్నలు కాగానే, వచ్చిన పని చెప్పి, మాటల్లో పడ్డాం.

సాయంకాలమవుతుంటే అలా ఏటి వేపు బయల్దేరాను ఎప్పుడోకాని యీ వూరు రాను. ఎప్పుడొచ్చినా వెంటనే వెళ్ళిపోవాలనుంటుంది.

ఆ మనుషులు, వారి దరిద్రం, అపరిశుభ్రత, అన్నీ చికాకు కల్గిస్తాయి.

ఊరిమధ్య పునాదుల వరకూ లేచి ఆగిపోయిన రామాలయం, రాజకీయస్వాతంత్ర్యం సంపాదించి చేతులు కడుక్కున్న దేశాన్ని జ్ఞప్తికి తెస్తుంటుంది.

తప్పదు ఈ వ్యవస్థ బద్దలు కావలసిందే అనుకుంటూ నడిచాను. లేకుంటే గోచిపాత కట్టుకుని, నెత్తిన జంగిడి పెట్టుకొచ్చిన కోమటి వైకుంఠం అప్పుడే అయిదెకరాల భూమి సంపాదించడ మేమిటి, రెక్కలు ముక్కలు చేసుకుని, తాత ముత్తాతల నుండి భూమిని సాగు చేస్తున్న 'హరిజనులు' తమకు కేటాయింపైన బంజర్లును కూడా లోపాయికారీగా అమ్ముకోవడ మేమిటి ?

కాడి ఏనాడు పట్టుకోని నాయుడిగారి కళ్ళం ఒత్తుగావేసిన కుప్పలతో పునిస్త్రీ ముఖంలో కళకళ లాడుతూవుండగా, ఒళ్ళు విరుచుకు పనిచేసే వారికంవార్లు కూటికి సరిపడా ధాన్యమైనా ఎరగకపోవడమేమిటి ?

ఏటిలో నీరు పాదాలుమునిగే మాత్రమే వుంది. ఏటిఒడ్డున పనసతోట — అప్పుడెప్పుడో మా దేనుట — కాపుకివస్తోంది. ఆకాశం ఎఱుపుకోల్పోయి, చీకటిచాపక్రింద నీరులావస్తుంటే యింటిదారిపట్టాను.

తెల్లారితే కుప్పనూర్పించి సాయంకాలానికి డబ్బు జతపరుస్తానన్నారు నాన్నగారు. ఆ గాకరకాయకూర, కొత్తిమిరిచారు, చిక్కని మజ్జిగలతో అమ్మపెట్టిన వేడివేడి అన్నం కడుపునిండాతిని నిశ్చింతగా పడుకున్నాను.

తొందర తొందరగా మనుష్యులు పరిగెడుతున్న ధ్వని. గాభరాగా వేస్తున్న కేకలు. 'ఏం జరిగిందా' అన్నభయంతో ఒక్కసారె మెలకువ వచ్చేసింది.

'నాయుడుగారి కళ్ళంలో కుప్పలంటుకున్నాయట్రా నాయనా !' అంది అమ్మ — భయం, అదుర్దా నిండిన గొంతుతో. వీధి అరుగు మీద ఖాళీగావున్న మంచం చూసి నాన్నగారప్పుడే అక్కడికి వెళ్ళేరనుకున్నాను. చీకటిలో తడువుకుంటూ మెట్లు దిగేను.

ఎంతరాత్రయిందో తెలియదు. ఆకాశంలో ఒకటీ అరా నక్షత్రాలు మిణుకు మిణుకుమంటున్నాయి. ఏ మబ్బుచాటున దక్కున్నాడో చంద్రుడు అయిపు లేడు. శీతవాయువుమాత్రం వీస్తోంది.

ఊరికి దాపునే నాయుడుగారి కళ్ళం. నిదానంగా అడుగులేస్తూ నడిచాను. కళ్ళం చుట్టూ చెట్లు. కాలుతున్న కుప్పల్నుంచి ఎర్రని మంటలు లేస్తున్నాయి. తెల్లని పొగ దట్టంగా అంతటా ఆవరించి వుంది.

అంతా హడావుడి పడుతున్నారు. టార్చిలైటు నాలుగు మూలలకివేస్తూ నాయుడు చెప్తున్నాడు: ఇక్కడే మంచం వాల్చుకు పడుకున్నాను. ఎందుకో మెలకువ వచ్చి చూస్తే కుప్పదగ్గర అలికిడయింది.'ఎవర్రా అది ?' అని కేకేస్తే జవాబు లేదు. టార్చి తీద్దామనివంగేను. మనిషి పరిగెత్తిన శబ్దం. అటుకేసి పరిగెత్తబోయేసరికి కుప్ప కాలిన వాసన వేసింది. వెంటనే అప్పిగాడిని భీముణ్ణి అందరినీ లేపాను.' అంతలోనే కాలుతున్న కుప్పవంకనిస్సహాయంగా చూస్తూ కేకలేస్తున్నాడునాయుడు 'ఆనంజికొడుకులు మాలోళ్ళని లేపండ్రా. తొంగున్నారిల్లల్లో. పరిగెత్తికెళ్ళి బట్టిలోంచి నీరుతెండి' అని.

నిప్పు. నిప్పు వార్పాలంటే నీరు కావాలి. ఊరిక్కి దూరంగా వుంది నుయ్యి. అంతకంటే దగ్గరగా ఏటినుంచి తీసిన పంట కాలువ పారుతోంది కడవలు పట్టుకు పరిగెట్టారటు వేపు కొందరు.

కొందరు మండుతున్న కట్టల్ని లాగి దూరంగా విసిరేస్తున్నారు. చేతులతో వాటి మీద దబదబా బాది మంట ఆర్పాలని చూస్తున్నారు.

అంతటా కలియదిరిగి, అందరినీ గదమాయించడమేగాని, తానుగా మంటనార్పే ప్రయత్నమూచెయ్యని నాయుడి వేపు చూస్తూ ఎడంగా నిల్చున్నాను— అతనికి లేని బాధ నా కెందుకని.

వెంకన్న వాడి కుటుంబం, మరికొద్ది మంది మినహా హరిజనులెవరూ మంటలార్పడానికి రాకపోవడం తలచుకుంటే మహ ముచ్చటేసింది నాకు. అర్పనీ నాయుడు. మిగతా నాయుళ్ళంతా మంట నార్పాలని అటూ, యిటూ, పరిగెత్తనీ. మాలవాళ్ళెందుకు రావాలి ? ఏడాది పొడుగునా ఒళ్ళు మన్ను చేసుకుని కుప్పలు పేర్చి గాదెలు నింపింది చాలక ఉత్త పుణ్యానికి ఒళ్ళు కాల్చుకోవాలా ? వాళ్ళంతా నిశ్శబ్దంగా వినిపించిన విప్లవ శంఖంలా తోచింది నాకది.

అప్పుడు చూసాను. మంటల వెలుగులో ఆయన ముఖం ఉద్రేకంతో మెరుస్తోంది. కట్టుకున్న తెల్ల పుల్లు పంచె ఎగ్గట్టి, పొడుగు చేతుల తెల్లచొక్కా విసురుగా విప్పేసి, యజ్ఞోపవీతం వెన్నుమీద తెల్లని చారలా వుండగా కుప్ప ఎక్కుతున్న మాష్టార్ని.

తరవాత ఓ పదిహేన్నిమిషాలు అంతటా ఆయన్నే చూసాను, బట్టికి పరిగెట్టి నీళ్ళు మోసుకువస్తూ, కుప్పల మీదకి నీళ్ళందిస్తూ, మంటల్ని కుప్పలెక్కి ఆర్పాలని యత్నిస్తూ, కూడా వున్న వారిని హెచ్చరించి ప్రోత్సహిస్తూ, నలుదిశలా ఆయనే !


ఆయన ప్రతిచర్య వికృతంగా వుంది

సాహిత్య మాసపత్రిక

'భారతి'

తప్పక చదవండి !






ఆంధ్రప్రదేశ్‌లో ఏజన్సీలు ఇవ్వబడుచున్నవి

VIJAYA : MPM


# మరి, నీకెలా కనబడుతోంది లోకం

బలహీనమైన శరీరం, అలవాటు లేని, చేతకాని పనులు చేస్తూ వుండడం వలన వచ్చిన వికృతత్వమది. అసహ్యం వేసింది. 'ఈ బ్రాహ్మడు— సింగిల్ స్కూల్ టీచర్ —నాయుడుగారి ప్రాపుకోసం ఎంత అవస్థ పడుతున్నాడురా' అని వెంటనే తిరిగి యింటి కొచ్చేసాను.

మనసు చిరాకుగావుంది. అధికారం, ఐశ్వర్యం పాదాలునాకే జాతి మనదనిపించింది.

ఉదయాన్నే తెలివొచ్చింది. ఇంకా యింట్లో ఎవరూ లేచినట్టులేదు. చెంబు పట్టుకుని ఏటివేపువెళ్తుంటే త్రోవలో ఎదురయ్యారు మాష్టారు. మొఖానపిండి కట్లు. తడిపంచభుజంమీద చేతిలోవున్న రాగిచెంబుతో నీళ్ళు. ఏటినుంచి స్నానంచేసి వస్తున్నట్టున్నారు.

తప్పుకు పోదామన్నా కుదిరింది కాదు. కాళ్ళు ఎత్తెత్తివేస్తూ 'ఉస్ ఉస్' అను కుంటూ నడుస్తున్నారు. చేతిలోబొబ్బలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. మొఖాన కొత్తగా కాలినగుర్తొకటి ఎడంకాలి వేళ్ళు రెండింటికి గుడ్డముక్కచుట్టివుంది. దాని మీద రక్తంమరకలు. 'తగినపనయింద'ను కున్నాను.

'నాన్నగారు చెప్పారు నువ్వొచ్చావని. చూసావా అఖరికెలాఅయిందో ఇవాళ తొలి ఝామున ఆరంభించుదామనుకున్నాడు వెంకన్న నూర్పు. సాయంకాలానికి గాలిపట్టి బస్తాలకెక్కించి, వైకుంఠం దుకాణానికి వప్పచెప్పి డబ్బు నీకిద్దామనుకొన్నారు నాన్నగారు. ఏ క్షణాని కేమవుతుందో చెప్పలేం !'

మాలవెంకడే మా పొలాన్ని మగతాకి సాగు చేస్తున్నాడు. అప్పుడు గుర్తొచ్చింది నాకు. మావూర్లో మాకు పొలమే కాని కళ్ళంలేదు. ఎప్పుడొచ్చినా నాయుడుగారింటో దిగినట్టే, ప్రతిఏటా పంట వారికళ్ళంలోనే నూరుస్తాడు వెంకన్న.

నాగుండె బేజారైంది. ప్రెస్టేచ్‌లాన్ పేంటింగ్స్ రెండుతీసుకున్నాను. వాటికి సరిపడే యింపోర్టెడ్ షర్టింగ్స్ సంపాదించి వుంచుకున్నాను. అన్నిటికంటేముఖ్యం ఏడాది పొడుగునా జీతం సరిపడక చేసిన అప్పులు తీర్చాలి.

నా ముఖంలో మారిన రంగుల్ని చూసి నట్టున్నారు మాష్టారు.

'నీకేం పరవాలేదులే! మిగతా కుప్పులు నూర్పించి వెంకడిచేత మగతా కొలిపిస్తారు నాయుడుగారు. ఒకటో, రెండో పుట్లు తక్కువైతే అవుతాయుంతే ?

నాకు ధైర్యం వచ్చింది ఆ మాటంతో పంటపోయినా; కుప్పకాలినా, వెంకన్న మా మగతా కొలవాల్సిందే. ఏమన్నా పేచీపెట్టినా నాయుడుగారున్నారు.

'వేసంగి వచ్చేస్తోంది కుప్పలిట్టే పెట్టు కురా అంటే విన్నాడుకాదు ఆ వెంకన్న. ఏడాది పొడవునా పెళ్ళాం పిల్లలతో ఏం తిప్పలు పడతాడో...' అంటూ వెళ్ళి పోయారు మాష్టారు. అంతవరకూ నాకి ఊహే రాలేదు !

'ఈ భూమి పగిలి నన్ను తనలో యిముడ్చుకుంటే బాగుణ్ణు' అని మగ వాళ్ళకి అనిపించే క్షణం ఒకటి వుంటే నా జీవితంలో ఆ క్షణం అలాంటిది.

అప్పుడు అకస్మాత్తుగా నాకు నేను బోధపడ్డాను.

నిన్నరాత్రి మంటలార్పడానికిరాని వెంకడి కులస్థులూ బోధపడ్డారు. ఎటొచ్చీ బోధ పడనిది మాష్టారే. ఏదో ఒక 'మోటివ్' లేని మంచితనం వుంటుందని నేనెప్పుడూ అనుకోలేదు.

లోకంలో మంచి అన్నది లేదని నా నిఖార్సయిన అభిప్రాయం. ఎందుకంటే నాలో ఆ మంచితనం లేదు కాబట్టి. నా మంచితనం మీద నాకే నమ్మకం లేక పోబట్టి — అని ఆ రోజు ఉదయం అలాగ తెలిసింది నాకు.





ఎ.జి.స్
రింగ్ సోలిన్

తామర, చిడుము మరియు ఎగ్జిమా మున్నగు చర్మ వ్యాధులకు శ్రేష్ఠమైనది

SAGSONS CHEMICAL CO.,
MADRAS-81